


# మీనా

## నవలారాణి నవలల నేపథ్యం



నేను మీనా నవల వ్రాసి దాదాపు 40 సంవత్సరాలు అవుతోంది. కానీ ఈ నవల ఇప్పటికీ ప్రతి సంవత్సరం రీ ప్రింటుకి వస్తూ, నాకూ నా పబ్లిషర్స్‌కి ధనలాభం తేవటమే కాకుండా, మమ్మల్ని ఆశ్చర్యానందాల్లో ముంచెత్తుతోంది. తరాలు మారినాయి. అయినా ఈ నవల పాఠకులు ఆదరణతో, నిత్యనూతనంగా పరుగులు దీస్తూనే ఉంది. నేను మీనా నవల వ్రాసేటప్పుడు 'మీనా'ని ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వపు లక్షణంగల అమ్మాయిగా సృష్టించానని అనుకున్నాను. కానీ 'మీనా' సీరియల్ యువ మాసపత్రికలో వస్తుంటే, అమ్మాయిల దగ్గరనుంచీ అమ్మ వయసుగల స్త్రీల దగ్గర నుంచీ ఇది మాకథే అన్నట్లుంది అన్నట్టు అసంఖ్యాకంగా వచ్చిన ఉత్తరాలు నన్ను చకితురాలిని చేసాయి. నేను త్వరలోనే ఒకటి అర్థం చేసుకున్నాను. 'మీనా' అనే అమ్మాయి ఒక సాధారణమైన వ్యక్తిత్వంగల అమ్మాయి. అందుకే నా చుట్టూ ఉన్న సమాజంలో అనేకమంది అమ్మాయిల గుండె తలుపులు తట్టి, వారితో మమేకం అయిపోయింది. తలితండ్రులు - పిల్లలు - ఇంటి పరువు ప్రతిష్టలు - స్వతంత్ర భావాలుకల నూతన తరం, నోరువిప్పి పైకి చెప్పలేని కుటుంబ వాతావరణం నేపధ్యం, ఇది అప్పటికీ - ఇప్పటికీ మారలేదని ఇప్పుడు అది ఇంకా ఎక్కువైందనీ, ఇప్పటి చదువుకున్న ఆడపిల్లలు నాకు చెబుతున్నారు.

నాకు తెలిసిన ఒక బ్యాంక్ ఆఫీసర్ ఉంది. ఆమె ఫ్రెండ్‌కి చాలా సుస్తీ చేసి తగ్గింది. ఆమె ఫ్రెండ్‌ని చూడటానికి వెళుతూ, ఫ్లవర్ బొకేతో పాటు, ఆ స్నేహితురాలికి అత్యంత ఇష్టమైన నవల 'మీనా'ని కూడా బహుమతి ఇవ్వాలని తనకి వెళ్ళటానికి తీరిక చిక్కక, ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న కూతురుని బుక్‌షాపుకు వెళ్ళి కొని తీసుకురమ్మని చెప్పింది. ఆ అమ్మాయి వెళ్ళి కొని తెచ్చింది. ఏమాత్రం ఆకర్షణ లేని, పాత పద్ధతి గెటప్‌తో ఉన్న 'మీనా' రెండు భాగాలని చూసి పెదవి విరిచింది. మొత్తం పేజీల సంఖ్య 700 పైన ఉన్నాయి. అమ్మా - ఆమె స్నేహితురాలు ఫోన్‌లో 'మీనా' గురించి మాట్లాడటం చాలాసార్లు వింది.

ఇంటికి వచ్చిన తర్వాత, సినిమాకి వెళదామన్న ఫ్రెండ్ రానని ఫోన్ చేయటంతో, బోర్ కొట్టి, 'మీనా' అక్కడక్కడ చదవటం మొదలు పెట్టి, కుతూహలం అనిపించి మొదటినుంచీ చదవటం ప్రారంభించింది. సాయంత్రం వాళ్ళమ్మ బ్యాంక్ నుంచీ వచ్చేవరకూ చదువుతూనే ఉంది. తల్లి, కూతురు తెలుగు నవల చదవటం చూసి ఆశ్చర్యపోయింది. అందులో 'మీనా' నవల. మమ్మీ బాగుంది అంది పూర్తి చేసిన తరువాత. తల్లి ఆ నవలని స్నేహితురాలికి బహుమతి ఇస్తే,

కూతురు షాపుకి వెళ్ళి మళ్ళీ కొనుక్కువచ్చి, తను చదవటమే కాదు, తన స్నేహితురాలికి కథ చెప్పి ఆమె చేత కూడా చదివించింది. వాళ్ళమ్మతో నా దగ్గరకి వచ్చినప్పుడు 'ఆంటీ నవల ఇప్పటి జనరేషన్ గురించి వ్రాసినట్లుంది. ఎలా వ్రాసారు మీరు' అంది.

నాకు సంతోషం అనిపించింది. 'మీనా' నవల నేపధ్యం ఏముంది ప్రత్యేకత! తలితండ్రులు - పిల్లలు - పరువు ప్రతిష్ఠలు. ఈ మూడు స్థంభాలే పునాది. ప్రతి తల్లితండ్రులు - ముఖ్యంగా తల్లి తన పిల్లలు, అందులో మరీ కూతురు - సలక్షణంగా పెరిగి, చదువుకుని, వివాహం చేసుకుని, తనలాగే బిడ్డల తల్లి అవాలి అనేది, ఈ ప్రయాసలో ప్రతీ మాతృమూర్తి యొక్క స్వప్నం. దానికి కులమతాలు గానీ, ధనిక, పేద అనే తారతమ్యంగానీ లేదు. పిల్లలు పక్కదారి పట్టి, భవిష్యత్తు ఏం నాశనం చేసుకుంటారో, తను సరిదిద్దలేని, తనకి అలవికాని, ఏ అనుభవాల ముళ్ళరక్కసిలో చిక్కుకుంటారో అని, ప్రతి తల్లి మనసులో ఒక అభద్రతాభావం ఉంటుంది. డబ్బు పోతే సంపాదించవచ్చు, పరువుపోతే మరో మంచిపని చేసి పరువు సంపాదించవచ్చు. ప్రాణంలాటి ఈ పిల్లలకి ఏదయినా జరగరానిది జరిగితే, ప్రాణం పోయినట్లే. ఒక సంతానాన్ని కని పెంచి పెద్ద చేయటానికి 25 సంవత్సరాల సమయం వెచ్చించాలి. దీనికి ఇంకో ఛాన్స్ ఉండదు. అందుకే పిల్లల పట్ల వారి మంచి భవిష్యత్తు పట్ల తలితండ్రులకు అంత పులిపంజా లాటి పొజిసివ్‌నెస్! ఇది తల్లితండ్రులు అయిన వారికే తెలుస్తుంది. కొన్ని సబ్జెక్ట్స్‌కి అవుట్‌డేటెడ్ అనేది ఉండదు. అవి మనిషి మనసులో ఉన్న మూలాలకి దర్పణాలు. అందుకే ఆ ఇతివృత్తాలకి నిరంతర యవ్వనం.

తరాలు మారినాయి. 'మీనా' నవల చదివిన పాఠకుల్లోనూ ఆ మార్పు వచ్చింది. దాదాపు 25 సంవత్సరాల క్రిత, ఒక తల్లీ కూతురు నా దగ్గరకు వచ్చారు. ఆవిడ వెంట 18 సంవత్సరాల కూతురు ఉంది. తల్లి వచ్చినప్పటి నుంచీ మీనా, జీవన తరంగాలు, ఆరాధన, వీటిని తను ఎలా చదివిందో, తన ఫ్రెండ్స్, తనూ ఎలా చర్చించుకున్నారో ధారాళంగా, నన్ను ఒక్క మాట మాట్లాడనీయకుండా చెప్పేస్తోంది. పాపం కూతురు చాలా బోర్ గా దిక్కులు చూస్తూ కూర్చుంది. నేను మధ్యమధ్యలో ఆ అమ్మాయిని మాట్లాడించాలని ప్రయత్నించాను. ఆ అమ్మాయి మాట్లాడలేదు. "ఇదంతే..అస్సలు మాట్లాడదు. అదే నా తలనొప్పి. రేపు పెళ్ళీ అయితే కాపురం ఎలా వెలగబెడుతుందో అని నాకు దిగులు" అనేసిందావిడ.




ఆ అమ్మాయి ముఖంలో రౌద్రం చూసాను. కాసేపు అయింతర్వాతఆ అమ్మాయి " మీ నవలలో కృష్ణవేణమ్మ అచ్చు మా అమ్మ లాటిదే! మీరు మా అమ్మని చూడలేదుగా ఎలా వ్రాసారు" అంది. వాళ్ళమ్మకి చాలా కోపం వచ్చింది. తర్వాత వెళ్ళేవరకూ ఆ అమ్మాయికి లెక్చరు యిస్తూనే వుంది. నాకో సంఘటన గుర్తుండటానికి ఆ అమ్మాయి కసిగా అన్న కామెంట్ కారణం.

చాలా సంవత్సరాలు అయిపోయింది. వాళ్ళముఖాలు కూడా నాకు గుర్తు లేవు. ఏడాది క్రితం ఒకామె వచ్చింది. భర్త డాక్టర్. బాగానే సెటిల్ అయింది. ఒక్కతే కూతురు. ఆవిడ చాలా ఏళ్ళక్రితం వాళ్ళమ్మతో వచ్చిన అమ్మాయినని గుర్తుచేసింది. నేను చాలా సంతోషపడ్డాను. ఆమె అన్న ఒక్కమాటకి చకితిరాలిని అయ్యాను. "ఆరోజు నేను మా అమ్మని తప్పుపట్టి, కృష్ణవేణమ్మ అన్నానుగానీ, ఈరోజు నేను అచ్చు మా అమ్మలాగానే ప్రవర్తిస్తున్నాను. అసలు కృష్ణవేణమ్మలాంటి

అమ్మలే 100% కరెక్ట్. మా అమ్మాయి ఫ్యాషన్ టెక్నాలజీ చేస్తోంది. అర్ధరాత్రి పబ్‌లు, ఫ్రెండ్స్ అంటూ తిరుగుతుంటే, నేను కక్కలేక-మింగలేక ఏడుస్తున్నాను. ప్రతి తల్లీ తనకూతురు చదువుకుని లక్షణంగా పెళ్ళిఅయి అత్తవారింటికి వెళ్ళాలని ఎందుకు అనుకుంటుందో యిప్పుడు అర్ధం అవుతోంది నాకు" అంది.

బహుశా 'మీనా' నవల తరాలు గడచినా పునర్ముద్రణకు రావటానికి ఇలా వారి అంతర్యాలని స్పృశించడమే కారణం అనుకుంటాను.

